# ఫోన్ మ్రోగింది!

రచన: శ్రీ బి. వి. డి. ప్రసాదరావు

ఆ భవనంలోనించి సన్నగా ఏడుపు వినిపిస్తోంది.

ఎవరో ఒకామె ఏడుస్తున్నట్టు వుంది!

కారణం?—

నాలో ఆతృత చొరవపడింది.

ఆమె నెవరూ ఓదారుస్తున్నట్టుగాని, చీవాట్లు వేస్తున్నట్టుగాని వినిపించడం లేదు!

లోపల చాలా ప్రశాంతంగా వుంది!

అప్రయత్నంగా ఆ భవనంలోకి ప్రవేశించాను.

హాలులో నించుని అటు ఇటు చూశాను. ఎవరూ కనిపించడం లేదు! ఎదురుగా కనిపిస్తున్న గదివేపు నడిచాను నేరుగా.

ఒకామె మంచంమీద అస్తవ్యస్తంగా పడుకొని ఏడుస్తోంది.

మరోసారి ఆశ్చర్యపోయాను.

ఇంత భవనంలో ఒక్కామె! అందులో ఏదో వ్యథలో!—

బయట తలుపులన్నీ పూర్తిగా తెరిచివున్నాయి.

ఏం జరిగిందో?- ఎందుకు బాధ పడుతోందో?!—

చిన్నగా దగ్గాను, కొన్నిక్షణా లాగి.

నా ఉనికిని ఆమె గమనించి, ఉలిక్కిపడి, లేచి నించుంది.

'ఏం....ఎవరు?!....'

ఆమె గొంతులోంచి మాట స్పష్టంగా రావడంలేదు. కొస్తా వణుకుతోందామె శరీరం.

'భయపడకు, తల్లీ! ఏడుపు బయటకు వినిపిస్తోంది. 'ఏ మాపదో' నని వచ్చేశాను. అది తప్పుగా అనిపిస్తే మన్నించు.'

'నన్ను చూడగానే అర్థం చేసుకొనే వుంటావు, నేనొక సాధుని. భిక్షంకోసం ఇంటిముందు నించున్నాను.... కష్టాల్లో వుండేవారికి మాట వూరడింపుతో ధైర్యం చెప్పడం నా అలవాటు. 'మానవసేవే మాధవసేవ' అని నా నమ్మకం.'

ఆమె ఏమీ మాట్లాడలేదు. మౌనంగా నావేపు చూస్తోంది. గుమ్మంలోనే నేను కూర్చున్నాను.

'నన్నర్థం చేసుకో, తల్లీ! ఇంతింటిలో ఒంటరిగా వున్నావు. ఏం, తల్లీ! ఎందుకలా కలతపడుతున్నావు?'

ఆమె అంతలోనే ఏడుపు మొదలుపెట్టింది. మళ్ళీ— మంచంకు దగ్గరగా నేలమీద కూర్చుంటూ—

'తప్పు, తల్లీ! ఏడవకు. నిబ్బరం వహించు. అన్నింటికీ ఆ భగవంతుడే వున్నాడు. వాడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు.'

'ఒంటరిగా వుంటున్నావు, ఎవరూ లేదా, తల్లీ!

ఆగి, చెప్పిందామె! 'ఉన్నారు ...'

'మరి....'

'....అంతా హాస్పిటల్ కెళ్ళారు.'

'అలాగా, ఏం, తల్లీ?'

'హఠాత్తుగా మావారికి చూపుపోయింది! కారు ప్రమాదంలో తలకు బలమైన దెబ్బ తగలడంతో చూపు పోయింది. ఆపరేషన్ చేస్తే, చూపు వచ్చే అవకాశం వుందని డాక్టర్లు చెప్పారు. ఆ ఆపరేషన్ కూడా అయ్యింది. ఈరోజు కట్లు విప్పుతారు.'

'మరి, నీవు వెళ్ళలేదేం, తల్లీ! ఎవరైనా వద్దన్నారా?'

'లేదు. నన్నూ రమ్మనన్నారు - వాళ్ళు హాస్పిటల్ కెళ్తూ. నేనే రాననేశాను. ఏదో అబద్ధం చెప్పేశాను.'

'ఏం, తల్లీ! అలా ప్రవర్తించావు?'

ఆమె వెంటనే ఏమీ మాట్లాడలేదు.

'చెప్పు, తల్లీ! నీతండ్రిలాంటివాడ్ని. ఎందుకు అబద్ధమాడేవు?'

* * *

—'ఇద్దరూ చేసినన్నాళ్ళు చేశారు. ఇక హాయిగా కాలాన్ని గడపండి.' అంటూ తన తల్లి దండ్రులకు ప్రత్యేకంగా మేడపైన ఒకగది కేటాయించేశారు మావారు— నేను కాపురంకు వచ్చినమర్నాడే! పైగా వాళ్ళు క్రిందన ఎక్కువసేపు వుంటే వొప్పుకొనేవారు కాదు! రోజుకో రకంగా...పళ్ళు, స్వీట్స్, 'అవి, ఇవి' అంటూ ఏదో తెస్తూ, దగ్గరుండి వాళ్ళచేత తినిపిస్తూ వుంటారు! తను ఇంట్లో వున్నంతసేపు ఇంచుమించుగా వాళ్ళదగ్గరే వుంటూ వుంటారు. ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ...'

—'మాధవికి మాతోనే పెళ్ళయింది! కొత్త పెళ్ళి కొడుకునని, బంధువులంతా వున్నారనికూడా యోచించక, మాధవి అత్తవారింటికి వెళ్ళిపోతున్నప్పుడు కన్నీళ్ళు కార్చేశారు మావారు! ఆడపిల్లలా మావారు అలా ప్రవ

Phone : 22465

మా తయారింపులు :—

• డాక్టర్, • ఏర్‌కూల్,
• గోల్డ్‌విన్, • లైఫ్,
• టిప్‌టాప్, • ఐలెట్.

Regd No. 306 682

TURKEY KNITTERS
Lakshiminagar Tirupur - 638 602.

త్తిస్తారని నేను ముందుగా వూహించలేకపోయాను:— ప్రతి ఆది, లక్ష్మివారాలలో తప్పక ఫోన్‌లో చెల్లెలతో మాట్లాడుతుంటారు మావారు. ఏదితెచ్చిన ఆమెకు ఒక వాటా తప్పక తీస్తుంటారు. ఆ వాటాతో తన వాటాను కూడా కలిపి, వెంటనే సర్వెంటుతో ఆమెకు పంపిస్తూ వుంటారు:...'

—'పెళ్ళయిన సంవత్సరంలోనే మేం తల్లిదండ్రులం అయ్యాము. మాకు బాబు పుట్టాడు. బాబు అంటే మా వారికి ప్రాణం. బాబు ఏడిస్తే, తనూ ఏడ్చేస్తారు. బాబు నవ్వితే, తనూ పొంగిపోతారు. బాబు ఏం కావాలన్నా కొనేస్తారు. వాడివిషయంలో 'లేద'ని, 'దొరకద'ని ఆయన గారు ఎప్పుడూ అనలేదు:...'

—'ఇక, ప్రతిసారి ఏదో తప్పు చూపిస్తూ నన్ను మాత్రం క్షణక్షణానికీ కలవరపరుస్తూనే వుంటారు. ముఖ్యం తన తండ్రిగారికి, నేను వేళకు 'దినపత్రిక' చదివి వినిపించకపోయిన... తన తల్లిగారికి, నేను వేళకు 'జడ ముడి' వెయ్యకపోయిన...బాబుకి, నేను ఏ వేళలోనైన 'అందుబాటు'లో లేకపోయిన ... కాలుకాలిన పిల్లిలా నా మీద చిందులువేస్తూ వుంటారు మావారు...'

—'అందుకే, అన్నీ తెలిసే నేను వెళ్ళలేదు. నిజానికి, మావారు కట్లు విప్పగానే నన్ను పిలవరు. నాకు తెలుసు. తెలిసి వెళ్ళడం ఎందుకు? వెళ్ళినా, ఎవర్నో చూస్తానని ఆయనగారు కోరడం, కోరిన మనిషిని ఆయనగారు చూడడం! నేనా దృశ్యాన్ని ఒక ప్రేక్షకురాలినై చూడడం. హుం. అది వింటే చాలదూ? చూస్తేనే భాగ్యమా?...'

—'నాకుమాత్రం, 'మాధవినే ఆయనగారు చూస్తా నంటారేమో' అని అనిపిస్తోంది. లేకపోతే, 'ఆమెకు ఫోన్ చెయ్యించి, ఈరోజుకు రెప్పించండ'ని ఎందుకు చెప్తారు??'

—'కన్నవాళ్ళు, తోబుట్టువు, కన్నబిడ్డముందు, నేను ఆయనగారికి ఎప్పుడూ కనిపించనేమో...ప్చ్...' ఆమె ఏడుస్తోంది—

* * *

ఆమె చెప్పిందంతా విని, చిన్నగా నవ్వేసి. నే నిలా అన్నాను: 'చూడు, తల్లీ! దేనినైనా అర్థం చేసుకొనేబుద్ధి వుండాలి. యోచన వుండాలి. ఎటువంటిదైనా ఎదురుకొనే మనోనిబ్బరం వుండాలి. అస్తవ్యస్తమైన ఆలోచనలను దరి జేర్చుకోరాదు. ఆవేశం, అసూయలను విడిచిపెట్టాలి. ఏదైనా 'మన మంచికే' అనే ధోరణిలో వుండాలి. అప్పుడే, మనసుకు శాంతి, ఆనందం, తప్ప, తల్లీ! ఏడవకు. నేను చెప్పేది కాస్తా విను. నీవు చెప్పిన సంఘటనలన్నింటి చుట్టూ నీభర్తే తిరుగుతున్నాడు. అంటే, 'నీభర్తే ముఖ్య పాత్రధారి' అని నీవాదన...అవునా? కానీ...'

అంతలోనే ఫోన్ మ్రోగింది.

హాలులో వుంది ఫోన్.

ఆమె లేవలేదు.

నేనే లేచాను. ఫోనెత్తాను.

అవతల గొంతువిని, రిసీవర్‌ను చేత్తో మూస్తూ—

'తల్లీ! 'లక్ష్మి' నీపేరే అనుకుంటా. 'లక్ష్మీ' అంటూ ఎవరో పిలుస్తున్నారు. రా, తల్లీ!' అన్నాను.

ఆమె లేచి, గబగబావచ్చి, నా చేతిలోని రిసీవర్‌ను అందుకుంది.

'ఆఁ, లక్ష్మినే. ఎవరూ?...'

ఆమెకు చాలా దగ్గరగా నేనున్నప్పటికీ అవతలగొంతు కాస్తా అస్పష్టంగానే వినిపిస్తోంది నాకు...

'నేనోయ్! మాధవి నడిగాను. నీవు రాలేదని చెప్పింది. ఏం రాలేదూ?...డాక్టర్‌గార్ని రిక్వెస్ట్‌చేసి, ఎలాగో ఫోన్ తెప్పించుకున్నాను నాదగ్గరకు...డైల్ చేసిపెట్టింది మాధవి. డాక్టర్‌గారు కట్లు విప్పేస్తానంటున్నారు. కొంతసేపు ఆగ మని రిక్వెస్ట్ చేశాను. ఎందుకో తెల్సా? కట్లు విప్పగానే నిన్నే చూడాలనివుంది నాకు...రావూ, ప్లీజ్!...'